కథ

బద్రి నర్సన్
94401 28169

విశ్రాంత జీవితానికి శుభారంభంగా హాయిగా ఆర్నెల్లు అమెరికాలో గడిపి.. శంషాబాద్‌లో విమానం దిగుతుండగా, రామస్వామి ఫోన్ మోగింది.

''రామస్వామీ! ప్రభాకర్ తల్లి చనిపోయింది!''.. అన్నారు అవతలి నుంచి.

''నేను ఇప్పుడే ఫ్లయిట్ దిగిన. హైదరాబాద్‌లో ఉన్న!''.. నేనేం చేయాలనే విసుగు.. ఆయన గొంతులో ధ్వనిస్తున్నది.

''ఎవరూ లేరు. నువ్వన్నా వస్తే!''..

తెలిసిన, దగ్గరి మనిషి గొంతే! కానీ, ఎవరో గుర్తుకు రావడం లేదు. నిజానికి, ప్రభాకర్ తల్లి ఇంతకాలం బతికుందన్న సంగతి కూడా రామస్వామికి తెలియదు.

''నేను రావడం కుదురదు కానీ, ఇదే నెంబర్‌కు డబ్బులు వేస్తాను. మీరు కానియ్యండి!'' అన్నాడు.

''సరే!'' అని అవతలి గొంతు అనడంతో..

పరిస్థితి అర్థమై, సరిపడే సొమ్ము వెంటనే ట్రాన్స్‌ఫర్ చేశాడు. కారులో నగరానికి వస్తున్న ఆయనకు ప్రభాకర్ గుర్తొచ్చి.. 'జీవితాన్ని సాహసాల కన్నా, భయాలే గెలిపిస్తాయి!' అనుకున్నాడు.

* * *

ఊర్లో చదువుకొనే రోజుల్లో ప్రభాకర్, రామస్వామి మంచి స్నేహితులు. అప్పుడు ఇద్దరికీ విప్లవోద్యమం అంటే ఎంతో ప్రేమ. ఆ పత్రికలు, పుస్తకాలు వదలకుండా చదివేవారు.

స్టూడెంట్ యూనియన్ లీడర్ ప్రకాశ్.. ఎక్కడా, ఎన్నడూ చూడని చైనా, రష్యా విప్లవాలకు, కమ్యూనిస్టు సిద్ధాంతానికి చెందిన ఎన్నో పుస్తకాలు ఇచ్చేవాడు. ఆయన పరిచయం వల్ల వీళ్లిద్దరికీ విప్లవమంటే ఏమిటో మరింత స్పష్టంగా తెలిసిందని అనుకునేవారు.

వరంగల్ జిల్లాలో పుట్టి పెరిగిన ప్రకాశ్.. కావాలనే జగిత్యాల కాలేజీలో డిగ్రీలో చేరాడు. పార్టీ పత్రికల పంపిణీ, మీటింగుల గురించి గోడపై రాతలు, కాలేజీలో నోటీసు బోర్డుపై ప్రభుత్వ నిర్ణయాలపై ఖండన మండనలు.. అన్నిట్లో తానే కనిపించేవాడు.

విప్లవంపై ఇంత ఇష్టం ఉన్నా కూడా.. ప్రకాశ్‌కు పనుల్లో సాయం చేద్దామంటే, ఎవరైనా చూసి ఇంట్లో చెబుతారనే భయం.. ప్రభాకర్, రామస్వామి ముందరి కాళ్లబంధంగా ఉండేది. అప్పటికే చుట్టుపక్కల పోలీసుల అరెస్టులు, ఎన్‌కౌంటర్ వార్తలు తెలిసి.. కాలేజీలో చదువుతున్న తమ పిల్లలు ఏ అఘాయిత్యంలో వేలు పెట్టి ఏం  చిక్కులు తెచ్చి పెడతారోనని తల్లిదండ్రులు కలవరపడుతున్నారు.

''ఇంత భయపడితే మనం విప్లవాన్ని కోరి లాభమేంది? పుస్తకాలు చదువుతాం. సిద్ధాంతాన్ని ఇష్టపడతాం. గంటల తరబడి చర్చిస్తాం.. కాలు మాత్రం కదపం. తెగువ కొరవడిన మనకు ఈ తెలివి దేనికి పనికొస్తది!'' అన్నాడు ఓ రోజు ప్రభాకర్ విసుగ్గా.

ఆయన అలా అనడానికి కొంత అర్థముంది. ప్రభాకర్ తండ్రి ఆరోగ్యం బాగుపడక ఇంటికి భారమనుకొని నడింట్లో ఉరివేసుకొని చచ్చిపోయాడు. ఒక్క గదిలో సర్దుకొని ఉంటూ మిగతా ఇంటిని కిరాయికి ఇచ్చి, బీడీలు చేస్తూ తల్లీ కొడుకులు కలిసి బతుకు బండి లాగుతున్నారు. మగపిల్లలు బీడీలు చుట్టడం అరుదే కానీ, తల్లికి సాయపడాలని ప్రభాకర్ నేర్చుకున్నాడు. జీవితం ఇచ్చిన చేదు అనుభవాలు ఆయనలో కొంత తెగింపును, అసహనాన్ని పుట్టించాయి. అందుకే.. ఆయన మాటలు ఏదో ఒకటి తేల్చేయాలన్నట్లుగా ఉంటాయి.

అలా ప్రభాకర్ మాటలు ముందుకు లాగినట్లుంటే.. రామస్వామి మాటలు మాటలకే పరిమితమైనట్లు వెనుకడుగు వేసినట్లుండేవి. ప్రభాకర్ వేసే ప్రతి ప్రశ్నకూ 'అవును కానీ..' అనే సమాధానమే వస్తుంది రామస్వామి నుంచి. ఆ మానసిక పరిస్థితికి అసలు కారణం రామస్వామి తండ్రి బట్టల వ్యాపారి. వారిది దేనికీ లోటు లేని కుటుంబం. అయితే ప్రభాకర్ కన్నా సిద్ధాంత జ్ఞానం రామస్వామికే ఎక్కువ. ఆయన ప్రస్తావించే ప్రపంచ చరిత్ర, పుస్తకాలు, రచయితల పేర్లు కొత్తగా ఉండేవి. ఈ లెక్కన ముగ్గురిలో రామస్వామే విప్లవ మేధావి. ప్రభాకర్ మెతగ్గా ఉంటూ.. 'ఓహో!' అన్నట్లు ఇద్దరి మాటలూ ఆసక్తిగా వినేవాడు.

నిర్బంధం పెరిగి, క్రమంగా శివారు ఇళ్లలో పోలీసుల దాడులు పెరిగాయి. దాంతో విప్లవపార్టీ వ్యూహాలు మార్చింది. ఓ రోజు రాత్రి పది గంటలకు రామస్వామి ఇంటి ముందు ఓ మోటరుసైకిల్ ఆగింది. వెనుక కూర్చున్నాయన దిగగానే.. మోటర్‌సైకిల్ ముందుకెళ్లి పోయింది. దిగినాయన రెండు వైపులా మనుషులను గమనించి ఇంటి తలుపు కొట్టాడు. తలుపులు తెరిచిన రామస్వామి తండ్రి..

''ఎవరు కావాలి?'' అని అడిగాడు.

''నేను రామస్వామి క్లాస్‌మేట్‌ని. సారంగాపూర్ మాది. వచ్చేటప్పుడు రూమ్ కీ ఇంట్లనే మర్చిపోయిన. పొద్దున ఊరికి పోయి తెచ్చుకుంట. ఈ రాత్రికి..'' అనగానే తండ్రి రామస్వామి ముఖం చూశాడు.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో విశిష్ట బహుమతి పొందిన కథ.